దశాబ్దాల కల.. నెరవేరిన వేళ

ఎన్నాళ్లో వేచిన ఉదయం రానేవచ్చింది.. చిరకాల స్వప్నం నెరవేరింది.. మూడు దశాబ్దాల నిరీక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ.. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కృషి వల్ల ప్రతిఫలం దక్కింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గాజువాక మండలం 79వ వార్డు కర్ణవానిపాలెం పునరావాసం సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకడంతో స్థానికులు సంతోషంతో ఉబ్బితబ్బిబవుతున్నారు.

- 30 ఏళ్ల తర్వాత కర్ణవానిపాలెం నిర్వాసితులకు పునరావాసం
- సీఎం జగన్ చొరవ.. ఎమ్మెల్యే నాగిరెడ్డి కృషితో సమస్య పరిష్కారం
- లాటరీ పద్ధతిలో ప్లాట్ల కేటాయింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

అగనంపూడి: ఎట్టకేలకు కర్ణవానిపాలెం నిర్వాసితులకు పునరావాసం దొరికింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ భూసేకరణ విభాగం మలి దశలో కర్ణవానిపాలెం, శనివాడ భూములను సేకరించింది. నిర్వాసితులకు ఇళ్ల స్థలాల కేటాయింపు విషయంలో అధికారులు మడత పేచి కారణంగా ఇన్నాళ్లు సాగుతూ వచ్చింది. వివిధ ప్రాంతాల్లో, ఖాళీగా ఉన్న ప్లాట్లు నిర్వాసితులకు కేటాయించేందుకు అధికారులు ప్రతిపాదనలు చేశారు. గ్రామం అంతటికీ ఒకే చోట స్థలాలు కేటాయించాలని అప్పట్లో గ్రామస్తులు డిమాండ్ చేయడంతో పునరవాసం సమస్యను అటకెక్కించేశారు. 1996 నుంచి ఈ సమస్యను పరిష్కరిస్తామని ప్రతి ఎన్నికల్లో అన్ని పార్టీలు హామీలు ఇవ్వడం.. ఆపై మడం తిప్పేయడం పరిపాటిగా మారింది. 2004లో ముఖ్యమంత్రిగా దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారం చేపట్టిన తరువాత నిర్వాసితులందరికీ ములగాడ, పెదగంట్యాడ ప్రాంతాల్లో స్థలాలు కేటాయించేందుకు ప్రతిపాదనలు చేశారు. వేరే చోట తమకు స్థలాలొద్దని గ్రామస్తులు చెప్పడంతో వారు ఉన్న చోటే లేఅవుట్ చేసి స్థలాలు కేటాయించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆయన అకాల మరణంతో సమస్య మళ్లీ మరుగున పడింది.

ముఖ్యమంత్రి జగన్ ఆదేశాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సీఎం వైఎస్ జగన్ వద్ద సమస్యను ప్రస్తావించడంతో కర్ణవానిపాలెం గుదిబండకు ఒక మార్గం దొరికింది. సమస్యను నాన్చకుండా సత్వరం పరిష్కరించాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించడంతో ఎమ్మెల్యే కృషికి ఫలితం దక్కింది. కర్ణవానిపాలెం వాసుల మూడు దశాబ్దాల కల నెరవేరే సమయం ఆసన్నమైంది.

లేఅవుట్, పట్టాలు సిద్ధం

అగనంపూడి సర్వే నంబర్ 95లో వివాదంలో ఉన్న భూమి విషయంలో న్యాయస్థానం ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునివ్వడంతో, సదరు స్థలంలో లేఅవుట్ చేసి 94 మంది కర్ణవానిపాలెం నిర్వాసితులు, 21 మంది శనివాడ నిర్వాసితులకు స్థలాలు సిద్ధం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో లాటరీ వేసి వివాదాలకు తావులేకుండా ప్లాట్లు కేటాయించారు.

అర్హుల పేర్లపై ఫిర్యాదులు

ఒకటి రెండు రోజుల్లో ప్లాట్లు కేటాయించేందుకు అధికారగణం సిద్ధం చేసింది. అయితే శనివాడ నిర్వాసితులతోపాటు కర్ణవానిపాలెం నిర్వాసితులు గతంలో స్థలాలు వేరే చోట తీసుకొని వాటిని అమ్మేశారని, వారి పేర్లు మళ్లీ జాబితాలో చేరాయని ఎమ్మెల్యే నాగిరెడ్డికి కొందరు ఫిర్యాదు చేయడంతో వాటిపై విచారణ చేపట్టారు. అనర్హులు ఉంటే తొలగించి అర్హులందరికీ కొద్ది రోజుల్లో స్థలాలు ఇచ్చేందుకు సిద్ధం చేశారు.


కర్ణవానిపాలెం ప్రాంతాన్ని ఆనుకుని సిద్ధం చేసిన లేఅవుట్

ప్రజా సమస్యలపై సీఎం ప్రత్యేక శ్రద్ధ



30 ఏళ్లుగా నలుగుతూ వచ్చిన కర్ణవానిపాలెం సమస్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిల ప్రత్యేక చొరవ వల్ల కొలిక్కి వచ్చింది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల దృష్టికి దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించడంతో అధికారులు సానుకూలంగా స్పందించారు. కర్ణవానిపాలెం సమస్యతోపాటు గాజువాక నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న భూ వివాదం, ఫార్మా సిటీ వివాహిత కుమారుల పట్టాలు, వడ్లపూడి, తుంగ్లాం ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించారు. – **తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్యే**

సంతోషంగా ఉంది

1996 నుంచి పునరావాసం కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పటికి సమస్య పరిష్కారం కుదిరినందుకు సంతోషంగా ఉంది. ఎన్నో ప్రభుత్వాలు మారాయి. మాకు మోక్షం దొరకదని ఢీలా పడిన సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పునరావాసం దక్కడంతో ఆనందంగా ఉంది.
– **కరణం పైడిరాజు, బాలయోగి, నిర్వాసితులు**

రుణపడి ఉంటాం

ఎంతో మంది ఎమ్మెల్యేలు వచ్చారు పోయారు. కాని ఎమ్మెల్యే నాగిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సమస్య పరిష్కరించారు. ముఖ్యమంత్రి జగన్‌తోపాటు ఎమ్మెల్యే నాగిరెడ్డికి మా గ్రామస్తులు రుణపడి ఉంటాం.
– **చిత్తా బుజ్జి, నిర్వాసితుడు**

225 మందికి ఉచిత వైద్య సేవలు


మెహర్‌నగర్ వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: స్ఫూర్తి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ, మెహర్‌నగర్ హౌసింగ్ కమిటీ ఆధ్వర్యంలో 72వ వార్డులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. జనరల్, నేత్ర, దంతాలకు సంబంధించి 225 మందికి వైద్య సేవలను అందించినట్టు నిర్వాహకులు తెలిపారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మెహర్‌నగర్ హౌస్ సొసైటీ అధ్యక్షుడు మొదలవలస కృష్ణారావు, సభ్యులు నర్సింహారావు, ఉరుకూటి అప్పారావు, పాగిరి రామకృష్ణ, ఎస్‌పీఎస్ కృష్ణారావు, మళ్ల ఈశ్వరరావు, కర్రి దుర్గారావు, వై.శ్రీరాములు, పరీదుల శ్రీనివాస్, ధనలక్ష్మి, విజయ, నాగమణి, సాయి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి బోరు ఏర్పాటుకు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: వేసవిలో విద్యార్థులకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నామని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని కొనవానిపాలెం ఎంపీపీ పాఠశాల ఆవరణలో నాడు–నేడు పనుల్లో భాగంగా మంచినీటి బోరు ఏర్పాటుకు ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వంశీరెడ్డి మాట్లాడుతూ ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కోన అప్పలనాయుడు, స్వామి, రాజు, అప్పారావు, ఉరుకూటి అప్పలనాయుడు, నాయుడు, రమణ, స్వామి, రాజు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సత్తెమ్మతల్లి పండగ


వెంకటేశ్వర కాలనీలో సత్తెమ్మతల్లికి గుడ్లు నైవేద్యంగా సమర్పిస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీలో కొలువైన శ్రీసత్తెమ్మతల్లి అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. గవర జగ్గయ్యపాలెం, హరిజన జగ్గయ్యపాలెంకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి గుడ్లను నైవేద్యంగా సమర్పించారు. ప్రతీ ఏటా ఈ రెండు గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి పండగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పుస్తక పఠనంపై ఆసక్తి అవసరం


పుస్తక పఠనంలో నిమగ్నమైన చిన్నారులు

పెదగంట్యాడ: విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి అవసరమని గ్రంథాలయాధికారి పి.వి.రమణ అన్నారు. పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు పుస్తక పఠనంపై శిక్షణ ఇచ్చారు. కథలు చెప్పారు. విద్యార్థులతో గ్రంథ పఠనం చేయించారు. అనుమానాలను నివృత్తి చేశారు.

ముగిసిన విండ్ బాల్ క్రికెట్ టోర్నీ



విజేతలతో యూత్ సభ్యులు

పెదగంట్యాడ: జీవిఎంసీ 76వ వార్డు నడుపూరులో శ్రీకృష్ణదేవరాయ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న విండ్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. తమ మిత్రుల జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం 35 జట్లు పాల్గొన్నాయి. ఎస్‌కేడీ యువత ప్రథమ స్థానం, ట్రోఫీ ఫైటర్స్ రెండో స్థానం, సీతానగరం జట్టు మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, రౌతు గోవిందరావు, బాబూరావు, నాగరాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి


మృతి చెందిన లాబా గడబ

గోపాలపట్నం: గుర్తు తెలియని రైలు నుంచి జారిపడిన ప్రమాదంలో ఒడిశాకు చెందిన వ్యక్తి వ్యక్తి మృతి చెందాడు. కొత్తపాలెం రైల్వే బ్రిడ్జ్ వద్ద చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి దువ్వాడ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం జయంతిగిరికి చెందిన లాబా గడబ(39) గుర్తు తెలియని ట్రైన్‌లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారి పడడంతో మృతి చెందాడు. దువ్వాడ రైల్వే పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఈ వ్యక్తికి సంబంధించినవారు దువ్వాడ రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

టైలర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


నూతన అధ్యక్షుడు దొడ్డి శ్రీనును సన్మానిస్తున్న టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో శ్రీవినాయక దుర్గా టైలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం ఉత్తరాంధ్ర టైలర్స్ ఐక్యవేదిక వ్యవస్థాపకుడు అతికినెట్టి సత్యనారాయణ నేతృత్వంలో జరిగిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా కునూర్ మల్లికేశ్వరరావు, అధ్యక్షుడిగా దొడ్డి శ్రీను, ఉపాధ్యక్షుడిగా అన్నాబత్తుల చిన్నారావు, ప్రధాన కార్యదర్శిగా బెల్లాన గంగరాజు, సహాయ కార్యదర్శిగా పి.వి.రమణ, కోశాధికారి కె.శ్రీనివాస్, సలహాదారులుగా కోనూరు శంకరరావు, బొడ్డు సాంబశివరావు, కార్యవర్గ సభ్యులుగా ఎస్.సత్యనారాయణ, కోడి గోవింద్, రమణ, సత్తిబాబు, శ్రీను, కృష్ణ, కనకేశ్వరరావు ఎన్నికయ్యారు.

ప్రైవేటీకరణతో ఉక్కు కార్మికుల భవిష్యత్తు అంధకారం


829వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే కార్మికుల భవిష్యత్తు అంధకారమవుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఆదివారం 829వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ దీక్షలో కాంట్రాక్ట్ వర్కర్స్ అధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 30 ఏళ్లుగా కార్మికులు ఆహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దేశంలో ఆగ్రగామిగా నిలిపితే, నేడు పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని డిమాండ్ చేశారు. ఇందు కోసం కార్మికులు, ఉక్కు నిర్వాసితులు ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రజా ఉద్యమంగా మలచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కాంట్రాక్ట్స్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మంత్రి రవి, ఎల్.సోంబాబు, నందికి తాతరావు, మరళీ కృష్ణ, మంగరాజు, కృష్ణ, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి


రాజీవ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


పేద మహిళలకు భోజనం అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

గాజువాక: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్ వర్ధంతి సందర్భంగా పాతగాజువాక జంక్షన్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు మాట్లాడుతూ ప్రధానమంత్రిగా రాజీవ్‌గాంధీ అందించిన సేవలను కొనియాడారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆయన కృషిని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గవర వెంకట రమణ, ఉరుకూటి బాబూరావు, ఉరుకూటి అచ్చిబాబు, దొమ్మేటి రమణారావు, ఉరుకూటి అప్పలనాయుడు, షేక్ అస్మత్ అలీ, బుద్ధరాజు వేణువర్మ తదితరులు పాల్గొన్నారు.

- కాంగ్రెస్ పార్టీ గాజువాక సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు ఆధ్వర్యంలో పలువురు నాయకులు పాత గాజువాకలోని రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడివాడ శ్రీను, యరబాల భూలోక, ఆనంద్‌బాబు, శనివాడ హరిబాబు, సియ్యాద్రి అప్పారావు, కొత్తపల్లి పెంటయ్య, ఉరుకూటి కుమార్, బైరాగి, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

జాగృతీ చారిటబుల్ ట్రస్ట్ వితరణ

ఉక్కునగరం: సామాజిక సంస్థ జాగృతీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం పేద ప్రజలకు సాయం అందజేశారు. దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో సమీప ఇస్లాంపేట, మదీనా బాగ్, సాకేత్‌పురం తదితర ప్రాంతాల్లో పేద ప్రజలకు మధ్యాహ్నం భోజనంతో పాటు పలు వంట సామాన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఎల్.వి.రమణయ్య, సభ్యులు గిరిజ, సత్యవాణి, ప్రవీణ్, లక్ష్మి, శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అమెరికన్ వర్సిటీలతో కలిసి ఏయూ ఎంఎస్ కోర్సులు

మద్దిలపాలెం: అమెరికన్ యూనివర్సిటీలతో కలిసి రెండు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సహకార మాస్టర్ ప్రోగ్రాంలను ప్రారంభించినట్టు ఏయూ వీసీ ఆచార్య పీజీవీడీ ప్రసాదరెడ్డి తెలిపారు. స్క్రాంటన్ వర్సిటీలో రెండేళ్ల ఎంఎస్ బిజినెస్ అనలిటిక్స్ కోర్సును ఏయూలో ఆన్‌లైన్‌లో ఏడాది, యూఎస్‌లో ద్వితీయ సంవత్సరం చదివే అవకాశం ఉంటుందన్నారు.

- ఎంఎస్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌ను మిస్సోరి స్టేట్ యూనివర్సిటీతో కలిసి ఏయూ సంయుక్తంగా అందిస్తుందని వీసీ తెలిపారు. ఇక్కడ విద్యార్థులు ఆంధ్రా యూనివర్సిటీలో ఆన్‌లైన్‌లో మొదటి సంవత్సరం, యూఎస్‌ఏలో రెండో సంవత్సరం చదువుతారన్నారు. రెండూ స్టెమ్‌ల కోర్సుల వల్ల విద్యార్థులు ఎంఎస్ కోర్సులను పూర్తి చేసిన తర్వాత మూడేళ్లపాటు ఓపీటీకి అర్హులన్నారు. వారు యూఎస్‌ఏలో పని చేసుకోవచ్చని చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 94401 91968 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

గోపాలపట్నం: ఎన్‌ఏడీ జంక్షన్ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ దిగువ సర్కిల్‌లో ఆటో డ్రైవర్లకు కంచరపాలెం ట్రాఫిక్ ఎస్‌ఐ వాసుదేవరావు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు నిబంధనలు పాటించాలని సూచించారు. రాంగ్ పార్కింగ్ చేసి ఫైన్లకు గురి కావద్దని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్పించవద్దని సూచించారు. ఆటోల్లో ప్రయాణించే వారిని గమనించాలన్నారు. ప్రతీ డ్రైవర్ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ లక్ష్మణరావు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

గురజాడ కళాక్షేత్రం పునః ప్రారంభం నేడు


కస్టమర్ మీట్-2023కు సిద్ధమైన గురజాడ కళాక్షేత్రం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని గురజాడ కళాక్షేత్రం సోమవారం పునః ప్రారంభం కానుంది. ఈ కళాక్షేత్రంలో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అధికారిక, ఉద్యోగుల కుటుంబీకుల శుభకార్యాలు, సభలు, సమావేశాలకు వేదికగా ఉపయోగపడుతోంది. కరోనా తీవ్రంగా ఉన్న పరిస్థితుల్లో నగరంలోని ఆస్పత్రుల్లో బెడ్లు అందుబాటులో లేకపోవడంతో గురజాడ కళాక్షేత్రంను 200 బెడ్ల కోవిడ్ సెంటర్‌గా మార్పు చేశారు. అప్పటి నుంచి కళాక్షేత్రం ఉద్యోగులకు, యాజమాన్యం ఫంక్షన్లకు అందుబాటులో లేకుండా పోయింది. ఉద్యోగులు, కార్మిక సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ నెల 22న పునః ప్రారంభం కాగా.. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ఉద్యోగులకు అందుబాటులోకి రానుంది. ఇందులో భాగంగా సోమవారం ఈ క్షేత్రం వేదికగా స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్ విభాగం ఆధ్వర్యంలో కస్టమీర్ మీట్–2023 జరగనుంది.

విజయదుర్గమ్మకు కలశాలతో మంగళ స్నానం


అమ్మవారికి మంగళస్నానం చేస్తున్న భక్తులు

గాజువాక: జీవీఎంసీ 67వ వార్డు గణేష్‌నగర్‌లో విజయదుర్గ అమ్మవారికి ఆలయ నిర్వాహకులు 108 కలశాలతో మంగళస్నానం చేయించారు. అమ్మవారి ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు విజయ్‌కుమార్, అప్పారావు, సింహాచలం, ఆదినారాయణ, గురునాథ్, వెంకటేష్, సుబ్బు, బుజ్జి, కృష్ణ, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం


వేసవి శిబిరంలో మాట్లాడుతన్న అతిథులు

మల్కాపురం: వేసవి శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో వివిధ అంశాలపై చిన్నారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో సుమారు 30 మంది చిన్నారులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ చూపిన వారికి కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రో గ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, రచయిత బి.సత్యానందం బహుమతులు ప్రదానం చేశారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి


అగనంపూడి వాకింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న ఇల్లపు ప్రసాద్

అగనంపూడి: అగనంపూడి వాకింగ్ ట్రాక్ వద్ద ఓపెన్ జిమ్ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్ అన్నారు. అగనంపూడి ఉక్కు జనరల్ ఆస్పత్రి రహదారిలో వాకింగ్ ట్రాక్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మేయర్ హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ల సహకారంతో అగనంపూడిలోని వాకింగ్ ట్రాక్ వద్ద ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేందుకు స్టాండింగ్ కమిటీ సభ్యురాలు ఇల్లపు వరలక్ష్మి కృషి చేయనున్నారన్నారు. వాకింగ్ క్లబ్ అధ్యక్షుడు మడగల నరసింగరావు మాట్లాడుతూ 79, 85 వార్డుల్లోని అగనంపూడి వాకింగ్ ట్రాక్‌ను నిత్యం వందలాది కుటుంబాలు వినియోగించుకుంటున్నాయని, మరిన్ని వసతులు కల్పించి సహకరించాలని కోరారు. వాకర్స్ క్లబ్ కార్యదర్శి బి.రామారావు, ప్రతినిధులు డొక్కా రమేష్, బలిరెడ్డి సత్యనారాయణ, పెదిరెడ్ల హరీష్, ఎం.రామచంద్రరావు, జె.అప్పారావు, ఎన్.గంగరాజు, చిన్ని, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశం చేసుకోవాలి


విద్యార్థులతో డీజీఎం ఉమా మహేశ్వరరావు

గాజువాక: విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించడానికి ప్రణాళిక ప్రకారం కృషి చేయాలని విశాఖ స్టీల్‌ప్లాంట్ డీజీఎం ఎస్.ఉమామహేశ్వరరావు సూచించారు. గాజువాక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో ఆయన మాట్లాడారు. లక్ష్యాలను ఏ విధంగా నిర్దేశించుకోవాలన్న అంశంపై పలు సూచనలు చేశారు. పిల్లల ఆలోచనలకు వారి తల్లిదండ్రులు కూడా ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ప్రతిభకనబరిచేలా సహకరించాలన్నారు. ఉన్నత చదువులు పూర్తి చేసిన వారికి పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అగనంపూడి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బలిరెడ్డి సత్యనారాయణ, గ్రంథాలయాధికారి బి.చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో స్వచ్ఛభారత్


గాంధీనగర్‌లో శుభ్రం చేస్తున్న రమణ, తదితరులు

పెదగంట్యాడ: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల ముప్పు తగ్గుతుందని వైఎస్సార్‌సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు గాంధీనగర్‌లో ఆదివారం కాలనీవాసులతో కలిసి ఆయన స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. శివాలయం ఆవరణలో పెరిగిపోయిన పిచ్చి మొక్కలతో పాటు పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని జీవీఎంసీ సిబ్బంది, జేసీబీ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికులకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తెంటూ నత్యనారాయణ, గొర్లె రామునాయుడు, రమణారావు, తిరుపతి, పాపినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు అండగా ప్రభుత్వం


పూర్ణానందశర్మను సత్కరిస్తున్న బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ప్రతినిధులు

అగనంపూడి: రాష్ట్రంలోని బ్రాహ్మణులకు తగిన గుర్తింపు ఇవ్వడంతోపాటు సామాజికపరంగా వెనుకబడిన వారికి మేలు చేయడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ(పూర్ణ) అన్నారు. ఆదివారం జరిగిన 79, 85 వార్డుల్లోని బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. క్రెడిట్ సొసైటీలోని ప్రతీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి చేరాలని, కార్పొరేషన్ ద్వారా పేద బ్రాహ్మణులకు మేలు చేస్తుందన్నారు. సొసైటీ బ్రాహ్మణ అర్చకులు, పురోహితులకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పూర్ణను వివిధ సొసైటీల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్రెడిట్ సొసైటీ విశాఖ బ్రాంచ్ మేనేజర్ శర్మ, శ్రీనివాస్, వాణి, బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు ధర్మాల సుబ్బారావు, వ్యాసశర్మ, కొత్తలంక సూర్యనారాయణ, రామకృష్ణ, కృష్ణారావు, పండా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్, శ్రీనివాస్, గురుగిరి, శ్రీదేవి, అన్నపూర్ణ, సీతాదేవి మాట్లాడారు.